# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి




## ఎంఎల్‌సి సిట్టింగ్ స్థానం కాంగ్రెస్‌దే




## టెన్త్, ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బంధీగా చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ , పదో తరగతి పరీక్షల నిర్వహణ పై శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యుల్ ప్రకారం నిర్వహించుటకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో మార్చి 5, 2025 నుండి మార్చి 25, 2025 వరకు ఇంటర్, మార్చి 21 నుండి ఏప్రిల్ 04, 2025 వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహిస్తామని దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలు ఉదయం 9గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఇంటర్ మొదటి సంవత్సరం 5065, రెండవ సంవత్సరం 4245 మొత్తం 9310 మంది విద్యార్థులు పరీక్షలకు హజరు కానున్నట్లు ఇందుకు గాను 16 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఈ సంవత్సరం మొదటి సారిగా ప్రతి సెంటర్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు, సెంటర్ అడ్రస్ రూట్ మ్యాప్ వివరాలు తెలిపే విధంగా హాల్ టికెట్‌పై క్యూర్ కోడ్ ముద్రించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. పదో తరగతిలో 3051 బాలురు, 3717 బాలికలు మొత్తం 6768 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వీటి నిర్వహణకు 36 పరీక్ష కేంద్రాలను, ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ స్టేట్ లెవల్ అబ్జర్వర్ ఫ్లయింగ్ వర్డ్ సిట్టింగ్ ఉంటారన్నారు.

## ప్రతి బ్యాలెట్ పేపరూ పరిశీలించాలి




## వయోజన విద్యకు ప్రోత్సాహం

### అక్షరాస్యత కేంద్రాలను ప్రారంభించిన కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/కాసిపేట :** మంచిర్యాల జిల్లా వయోజన విద్యాశాఖ, ఓరియన్ సిమెంట్ దేవపూర్ సహకారంతో కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో అక్షరాస్యత కేంద్రాలు, కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వయోజన విద్య సమాజ అభివృద్ధికి కీలక భూమికను పోషిస్తుందని, అక్షరాస్యత పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువు నిర్లక్ష్యం చేయబడిన వృద్ధులకు, మహిళలకు, యువతకు ఈ అక్షరాస్యత కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చదువు అనే ఆయుధాన్ని ప్రతి ఒక్క రూ స్వీకరిస్తేనే సమాజం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కుట్లు, హస్తకళలు, ఇతర ఉపాధి సంబంధిత శిక్షణ కార్యక్రమాలు గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధిని పెంపొందించుకొని, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవడానికి ఈ శిక్షణ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అక్షరాస్యత కేంద్రాల్లో విద్యతోపాటు మహిళలకు కుట్టు శిక్షణ, హస్తకళలపై ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తామని అధికారులు తెలిపారు. అక్షరాస్యత పెంచడం ద్వారా మహిళలు, వయోజనులు తమ హక్కులను తెలుసుకుని, సొంతంగా ఉపాధి మార్గాలు అన్వేషించేందుకు వీలుకల్పించగలుగుతారని వివరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఓరియంట్ సిమెంట్ జిఎం ఆనంద్ కులకర్ణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎస్. కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డిడబ్ల్యూఓ రావుఫ్ ఖాన్, ఎంపిడి సత్యనారాయణ సింగ్, ఎంఆర్ఓ బోజన్న తదితరులు హాజరై వయోజన విద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, అధికారులు, శిక్షణ పొందే మహిళలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని వయోజన విద్యపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## టెన్త్, ఇంటర్ విద్యార్థుల నడుమ బాహాబాహి

### రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో ఘటన.. గోప్యంగా ఆస్పత్రికి తరలింపు

### చర్యలు తీసుకోవాలంటున్న తల్లిదండ్రులు



**ప్రజాపక్షం/చొప్పదండిః** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ విధ్యార్థులు పదో తరగతి చదువుతున్న విధ్యార్థులను చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ గోప్యంగా ఉంచి విధ్యార్థులకు వైద్య సేవలు అందించినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే ఈ నెల 20న సాయంత్రం ఇంటర్మీడియట్ విధ్యార్థులు 10 మంది కలిసి పదోతరగతి చదువుతున్న 8 మంది విధ్యార్థులపై బౌతికంగా దాడి చేశారు. ఈ దాడిలో కొందరికి గాయాలు కాగా రాత్రి కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రిన్సిపాల్ సైనిక్ స్కూల్ డైరెక్టర్ నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు శుక్రవారం సైనిక్ పాఠశాలకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. సంఘటన స్థలానికి ఎస్సై గొల్లపల్లి అనూష చేరుకుని విధ్యార్థుల తల్లిదండ్రులు, విధ్యార్థులతో మాట్లాడారు. గతంలోనూ పదో తరగతి చదువుతున్న విధ్యార్థులు 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విధ్యార్థులను దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఇటువంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయి. ఇదిలా ఉండగా విధ్యార్థులు కొందరు మత్తు పధార్థాలకు బానిస అవుతున్నారని ఆరోపణలున్నాయి. సైనిక్ పాఠశాల ఉపాధ్యాయులు విధ్యార్థులతో కలిసి మద్యం సేవిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రిన్సిపల్ డైరెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విధ్యార్థులను పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పిల్లలను విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి పంపిస్తే క్రమశిక్షణ లేకుండా చేస్తున్నారని వాపోఆయారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రిన్సిపాల్‌ను, డైరెక్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని విధ్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## పేదల పెన్నిధి సర్దార్ రవీందర్‌సింగ్

**ప్రజాపక్షం/రామగుండం :** కరీంనగర్‌లో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పేదలకు పలు పథకాలను అమలు చేసి పేదల పెన్నిధిగా నిలిచారని, ప్రస్తుత మెదక్‌నిజామాబాద్‌ఆదిలాబాద్‌కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ పట్టభద్రుల ఓటర్లను కోరారు. శుక్రవారం రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంతంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క రూపాయికే అంతిమయాత్ర, నల్ల కనెక్షన్, సరస్వతీ ప్రసాదం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేశారన్నారు. బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం నిత్యం శ్రమిస్తున్న రవీందర్‌సింగ్‌ను గెలిపిస్తే పట్టభద్రులందరికి ఒక్క రూపాయికే హెల్త్ ఇన్సురెన్స్ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. బ్యాలెట్ పత్రంలోని క్రమ సంఖ్య 11లో ఉన్న సర్దార్ రవీందర్ సింగ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తారన్నారు. మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, నాయకులు రాజోజుల శివకుమార్, గొట్టం మహేష్, పొన్నం అనిల్‌గౌడ్, పూసాల రణధీర్‌లు పాల్గొన్నారు.

## కాలుష్య రహిత భారత్ కోసం..



## ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఫార్చ్యూన్ మెడికేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. యాదవ సంఘం భవనంలో ఈ వైద్య శిబిరంలో సుమారుగా 120 మంది గ్రామస్థులకు బిపి, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికేర్ హాస్పిటల్ డాక్టర్లు క్యాంపు ఇంచార్జి గణేష్, వైద్య సిబ్బంది, యాదవ సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి దాడి లచ్చయ్య తదితరులున్నారు.

## పేద కుటుంబాలకు నిత్యావసరాలు



ప్రజాపక్షం/రామగిరి: పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ మండలంలో పలు పేద కుటుంబాలకు సుందరం ఫౌండేషన్ ఫౌండర్ బోనాల వెంకటస్వామి పటేల్ ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన కొయ్యడ ఐలమ్మ నిరుపేద కుటుంబానికి 25కిలోల బియ్యం తో పాటు 17రకాల నిత్యావసర సరుకులు, అలాగే కమాన్పూర్ గ్రామపంచాయతి పరిధిలోని కేశవ నగర్ కి చెందిన జంగపల్లి సావిత్రికి, న్యూ ఎస్సీ కాలనీకి చెందిన తిప్పారపు ప్రభాకర్లకు ఒక్కొక్కరికి 25కిలోల బియ్యం సాయంగా అందజేశారు. మా ఫౌండేషన్ ద్వారా ప్రతీ పేద బాధితుడికి నిస్వార్థమైన మనస్సుతో సాయం అందించాలనే లక్ష్యంతోనే మా సంస్థ పనిచేస్తుందని ఈసందర్భంగా వెంకటస్వామి పటేల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కన్నూరి నగేష్, చిప్పకుర్తి అరవింద్, దండే తిరుపతి, గుంజపడుగు నవీన్, కుక్కు వర ప్రసాద్, చెన్నోజు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

ప్రజాపక్షం/రామగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమం కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టి శుక్రవారం కమాన్పూర్ సబ్ పోస్ట్ ఆఫీసు వద్ద పోస్ట్ కార్డులను పోస్ట్మాస్టర్ చిరంజీవికి అందజేసి ముఖ్యమంత్రి అడ్రస్ పై పంపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు 250 గజాల స్థలము అలాగే గృహ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని అలాగే ప్రతి ఒక్క ఉద్యమకారునికి పెన్షన్ ఇవ్వాలని స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కళాధర్ రెడ్డి, కమాన్పూర్ మండల శాఖ అధ్యక్షుడు మట్ట రాజయ్య ,కమాన్ పూర్ మండల ఉపాధ్యక్షుడు దాసరి రామస్వామి, పొన్నగంటి రాయనరసు , అనవేన భూమయ్య, గుండ్రాతి మల్లయ్య, దండే పల్లి రాజయ్య, సాగి అజిత్, రావ్ ,మట్ట రాధా ,వంతకాని రవి, గుర్రం శంకర్, కొలిపాక శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర కృషితో మళ్లీ స్టేట్ స్థాయికి ఎదుగుదల

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 57వ శాఖను శుక్రవారం బ్యాంక్ చైర్మన్ ముత్యాల లక్ష్మణ్ రెడ్డి ప్రారంభించారు. బ్యాంకు చైర్మన్ ,డైరెక్టర్లు ,పుర ప్రముఖులు ,సహకార అధికారులు ,ముఖ్య కార్యనిర్వహణ అధికారులు పాల్గొని బ్యాంకులోని వివిధ విభాగాలను ప్రారంభించారు .ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ ముత్యాల లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ 2000లో ప్రారంభించబడిన గాయత్రి బ్యాంకు నిరంతర కృషితో నేడు మళ్లీ స్టేట్ బ్యాంకుగా రూ. 3062.50 కోట్ల వ్యాపారాన్ని సాధించి తెలంగాణలోని కో ఆపరేటివ్ బ్యాంకులలో అతిపెద్ద బ్యాంకుగా అవతరించి కో ఆపరేటివ్ వ్యవస్థలో అగ్రగామిగా పనిచేస్తున్నామని అన్నారు .గొల్లపల్లి మండల ప్రాంత ప్రజలు బ్యాంకు యొక్క సేవలను వినియోగించుకొని బ్యాంకును ఆదరించాలని కోరారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 56 బ్రాంచీలతో 7లక్షల 62 వేల మంది వినియోగదారులను కలిగిమంచి అభివృద్ధిని సాధించామన్నారు. బ్యాంకు సేవలు మొబైల్ బ్యాంకింగ్ ,ఏ ఇపిఎస్ ,యు పిఐ ,ఏటీఎం సర్వీసులు ,ఆర్ టి జి ఎస్ వంటి టెక్నాలజికల్ సేవలతో పాటుగా నిరక్షరాస్యులకు సహాయకంగా ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్యతరగతి ,వర్తక ,వాణిజ్య వర్గాల ప్రజలకు కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సేవలందించడమేనని , గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా ద్వారా ఒక లక్ష రూపాయల ప్రమాద బీమా అందిస్తున్నామని తెలియజేశారు . ఏజీఎం బింగి తిరుపతి మాట్లాడుతూ వినియోగదారులు మాపై చూపిస్తున్న ఎనలేని ఆదరాభిమానాల వల్ల బ్యాంకును మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామన్నారు. బ్రాంచి మేనేజర్ నేరెళ్ల మునీందర్ మాట్లాడుతూ ఆసరా పెన్షన్లను పొందవచ్చని వివరించారు.

## జూడో సంఘంలో 'జగిత్యాల' వాసులకు చోటు

ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం కార్యవర్గంలో జిల్లా వాసులకు అరుదైన అవకాశం దక్కింది. కరీంనగర్‌లోని మైత్రి హోటల్ లో తెలంగాణ రాష్ట్ర జూడో సంఘానికి ఎన్నికలను నిర్వహించారు.ఈ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర జూడో సంఘానికి ఉపాధ్యక్షులుగా జగిత్యాల జిల్లా జూడో సంఘం అధ్యక్షులు భాదినేని రాజేందర్,కార్యవర్గ సభ్యుడిగా జగిత్యాల జిల్లా జూడో సంఘం ప్రధాన కార్యదర్శి మర్రిపెల్లి శ్రీనివాస్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎన్ పరమేశ్వర్ ప్రకటించారు.ఈ సందర్భంగా రాజేందర్, శ్రీనివాస్ లు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర జూడో సంఘం బాధ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో జగిత్యాలలో జూడో క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా వేదికగా పలు జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి జూడో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా వీరిని తెలంగాణ జూడో సంఘం చైర్మన్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, తెలంగాణ జూడో సంఘం అధ్యక్ష కార్యదర్శులు బండ రాజ్ కుమార్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జగిత్యాల జిల్లా డీవైఎస్ఓ రవి కుమార్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి లక్ష్మి రామ్ నాయక్ , ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం భాద్యులు నందెల్లి మహిపాల్, తుమ్మల రమేశ్ రెడ్డి, నాగిరెడ్డి సిద్దారెడ్డి, మహ్మద్ కరీం, సీహెచ్ సంపత్ రావు, జగిత్యాల జిల్లా పెటా సంఘం అధ్యక్ష కార్యదర్శులు పడాల విశ్వప్రసాద్, అశోక్,సీనియర్ పి డి లు,పి ఈ టి లు,తదితరులు అభినందించారు.

## కళాశాలకు ఎగనామం పెట్టి పుస్తకాలు రాసి కోట్లకు ఎగబాకాడు

### బిసి కుల సంఘాల ఐక్యవేదికరాష్ట్ర అధ్యక్షుడు హరిప్రసాద్ ఆరోపణ

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న ప్రసన్న హరికృష్ణ ప్రభుత్వ ఉద్యోగిగా కళాశాలలో పనిచేసిన సమయంలో తాను చదవు చెప్పాల్సిన కాలేజీ విద్యార్థులను గాలికి వదిలేసి కోచింగ్ సెంటర్స్ కు అమ్ముడు పోయాడని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ ఆరోపించారు. జగిత్యాలలో దేవిశ్రీ గార్డెన్స్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ పట్టభద్రులు నియోజకవర్గ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ ను గెలిపించాలని పట్టభద్రులను కోరారు.ప్రసన్న హరికృష్ణకు బిసిల మధ్యలో చీలికలకు ప్రయత్నం చేస్తున్నాడనీ చెబుతూ ఆయన బిజెపి పార్టీ కనుసన్నలలో పనిచేస్తున్నాడని ఆరోపించారు. బిజెపికి హరికృష్ణ మధ్య జరిగిన ఒప్పందం ఏంటో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు తన సొంత ఎజెండాను అమలు చేసి తన దృష్టి పుస్తకాల తీయడం పైననే పెట్టి తద్వారా కోట్ల రూపాయలు దండుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని హరిప్రసాద్ చెప్పారు.ప్రసన్న హరికృష్ణ అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించుకొని ఇప్పుడు ఎమ్మెల్సీగా పోటీ చేస్తూ కేవలం డబ్బులు సంపాదనే లక్ష్యంగా అతను రాజకీయాలకు వచ్చారని మండిపడ్డారు.హరికృష్ణ ను నమ్మడానికి బిసిలు అమాయకులు కారని అతడు ఉద్యోగంలో ఉన్న కాలంలో ఏనాడు బిసి ఉద్యమంలో పాల్గొనలేదనీ కనీసం తెలంగాణ ఉద్యమంలో కూడ జై తెలంగాణ అని నినాదం చేసిన సందర్భాలు లేవనీ పేర్కొన్నారు. బిసి కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు గొట్టం మహేష్, పొన్నం అనీల్ గౌడ్, పూసాల రణధీర్ రారోజుల శివ కుమార్ పాల్గొన్నారు.

# దోపిడీ రహిత సమాజ స్థాపన లక్ష్యం

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : దోపిడి రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా కమ్యూనిస్టుల ప్రణాళికలు ఉండాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రవెల్లి ముత్యం రావు అన్నారు. శుక్రవారం రోజున సిపిఎం పార్టీ పెద్దపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయంలో రెడ్ బుక్ డే జరపడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎరవెల్లి ముఖ్య రావు హాజరై మాట్లాడుతూ. ఈ రెడ్ బుక్ డే సందర్భంగా సిపిఎం పార్టీ 24 వ మహాసభల రాజకీయ సమీక్ష నివేదిక, రాజకీయ ముసాయిదా తీర్మానం అంశాలపై చర్చించడం జరిగింది. ఈ రెడ్ బుక్ యొక్క ప్రధానమైనటువంటి అంశం ఈ ప్రపంచంలోనే ఉన్నటువంటి దోపిడీని నిర్మూలించి దోపిడీ లేని సమాజాన్ని సమ సమాజాన్ని స్థాపించాలంటే ఏం చేయాలనే అంశంపై 1848 లో కారల్ మార్క్స్,ఎంగిల్స్ కమ్యూనిస్టు ప్రణాళిక తయారు చేసి రూపొందించి ప్రచురించారని అన్నారు. అట్లాంటి ఈ మొత్తం ప్రపంచ మానవాళికి విముక్తి కనిపించేటువంటి కమ్యూనిస్టు ప్రణాళిక ప్రకటించిన రోజును గుర్తు చేసుకొని నేడున్నటువంటి సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఆదేవిధంగా మొత్తం మానవ సమాజ విముక్తి కోసం జరిగేటువంటి కృషిలో సిపిఎం పార్టీ శ్రేణులు సభ్యులు అందరూ భాగస్వాములు కావాలంటే సైద్ధాంతిక రాజకీయ నిబద్ధతను చైతన్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని




అన్నారు. అందుకని ఈరోజు ఫిబ్రవరి 21 రెడ్ బుక్ డే గా ప్రకటించి భారతదేశ వ్యాప్తంగా ఉన్నటువంటి సిపిఎం పార్టీ సభ్యులు శ్రేణులందరూ ఈ రాజకీయ సమీక్షా నివేదిక,రాజకీయ ముసాయిదా తీర్మానం ను అధ్యయనం చేయడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న జరిగేటటువంటి రెడ్ బుక్ డే సందర్భంగా మొత్తం పార్టీ శ్రేణులంతా మరింత చైతన్యవంతం కావడం కోసం ఈ అధ్యయన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు.కాబట్టి ఈ అధ్యయనం అనేది భారతదేశంలో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం శ్రామిక ప్రజల విముక్తి కోసం జరిగే కృషిలో భాగమని అన్నారు. పార్టీ శ్రేణులంతా పాల్గొని మరింత చైతన్యం పెంచుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవీందర్, జి జ్యోతి, కళ్ళేపల్లి అశోక్, నాయకులు ముద్దంపల్లి శ్రావణ్, సిపెల్లి దిలీప్, ఎస్ వెంకటస్వామి, శ్రీనివాస్ రెడ్డి, నరేష్, ముస్తఫా, సూరి, సందీప్, ప్రేమ్ కుమార్, మల్లేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుష్ఠు రహిత సమాజం కోసం కృషి చేయాలి

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం వైద్య సిబ్బందితో పాటు ప్రతిఒక్కరు కృషి చేయాలనీ లెప్రసీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు పిలుపునిచ్చారు.శుక్రవారం జగిత్యాల పట్టణంలోని మోతే అర్బన్ హెల్త్ సెంటర్ ను జాన్ బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య బృందం సందర్శించివైద్య సిబ్బందికి కుష్టు వ్యాధి నివారణకు తగు సలహాలు, సూచనలు చేశారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బందినీ ఉద్దేశించి డాక్టర్ జాన్ బాబు మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి ఎండీటీ డ్రగ్స్ ద్వారా పూర్తిగా తగ్గించవచ్చని అన్నారు. అంగవైకల్యం రాకుండా డ్రగ్స్ ద్వారా నివారించవచ్చన్నారు.కుష్టు వ్యాధి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహనా కల్పించాలనీ జాన్ బాబు వైద్య సిబ్బందికి సూచించారు.అలాగే ఎల్సీడిసి, స్పాక్ ప్రోగ్రామ్ పై డాక్టర్లు, వైద్య సిబ్బందితో రాష్ట్ర వైద్య బృందం సమీక్షించారు.కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. ప్రమోద్ కుమార్, ఉప వైద్యాధికారి శ్రీనివాస్,మోతే అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్.రవిశంకర్, రాష్ట్ర బృందం సభ్యులు డీపీఎంఓ లు వెంకటేశ్వరా చారి, వెంకటరమణ,శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి,వెంకట్రాంరెడ్డి, సురేందర్,మధుకర్,స్టాఫ్ నర్సు రాధ, సృజన్ కుమార్,మాదేషి శిరీష,పద్మ, జ్యోతి, నాగరాణి, ఉజ్వల తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన వ్యక్తం చేస్తూ యునైటెడ్ ముస్లిం ఫోరం, పెద్దపల్లి ఆధ్వర్యంలో శుక్రవారం రోజున భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జామా మస్జిద్ నుండి ప్రారంభమై జండా చౌరస్తా, కమాన్ చౌరస్తా మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించి, అనతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవో శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ దేశంలో బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింలపై కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని, అందులో భాగంగానే ఈ బిల్లును తీసుకొచ్చారని, ఈ బిల్లును భారతదేశంలోని ప్రతి ముస్లిం వ్యతిరేకిస్తున్నారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లు పై పునరాలోచించి తక్షణమే బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా తమ నిరసన కార్యక్రమాలను ఉదృతంగా చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ ర్యాలీలో పెద్దపల్లి పట్టణ ముస్లిం యునైటెడ్ ఫోరం సభ్యులు, ముస్లిం మత పెద్దలు అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

## బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం

ప్రజాపక్షం/ వీర్నపల్లి: భారతీయ జనతాపార్టీ మండల అధ్యక్షులు మాలోత్ లక్ష్మినాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా హాజరైన జిల్లా అధ్యక్షులు రెడ్డిబోయిన గోపి మాట్లాడుతూ పట్టభద్రులందరూ బీజేపీకి పట్టం కట్టే యోచనలో ఉన్నారని, ఈ ఎన్నికల్లో మూడు స్థానాలను కైవసం చేసుకుంటామని అన్నారు. ఎన్నికల ముందు అడ్డగోలుగా హామీలిచ్చి, అందులో ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేదని ముఖ్యంగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నిరుద్యోగభృతి అందించడంలో కాంగ్రెస్ విఫలం అయిందని తెలిపారు. పట్టభద్రులు ఉపాధ్యాయులకు ఏ సమస్య ఎదురైనా బిజెపి అండగా ఉంటుందని, మల్క కొమురయ్యకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.ప్రధానకార్యదర్శి పిట్ల నాగరాజు, సీనియర్ నాయకులు బండారి మహేష్, బట్టు పీర్య, బానోత్ శ్రీనివాస్‌నాయక్, లకావత్ రాజు, ప్రకాష్, రమేష్, బాజిరెడ్డి, మాదుగుల లక్ష్మీరాజు, భూక్య దర్సింగ్, తిరుపతి,కమటం రవి, నరేష్ ఉన్నారు.

# అవినీతికి పాల్పడిన సిఇఓను వదిలేసి చైర్మన్‌కు నోటీసులా!

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** అవినీతికి పాల్పడిన సిఈవోను వదిలేసి చైర్మన్‌ను నోటీసులు ఇవ్వడం ఏంటని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ సహకార సంఘం చైర్మన్ అంకతి రాజన్న అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సహకార సంఘంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020 సంవత్సరంలో చైర్మన్‌గా ఎన్నికైన తమ పాలకవర్గంలో పని చేసిన పాత సీఈవో తిరునగరి మధుకర్ చేసిన అక్రమాలకు స్పందించిన యామాపూర్ సహకార సంఘం పాలకవర్గం జగిత్యాల జిల్లా సహకార సంఘం అధికారికి అవినీతికి సంబంధించిన




ఆధారాలు చూపి సీఈవో మధుకర్‌ను 2021 సంవత్సరంలో తొలగించాలని తీర్మానం చేశామన్నారు. అవినీతి చేసిన సిఈవోను జిల్లా ఉన్నత అధికారులు వదిలేసి ఈ నెల 3న తమకు నోటీసులు ఇవ్వడం ఎమిటనీ ప్రశ్నించారు. సదరు సీఈవో ఆస్తులను జప్తు చేసి యామాపూర్ సహకార సంఘంలో పని చేసిన సీఈవో నుండి డబ్బులు కట్టించాలని చైర్మన్ రాజన్న జిల్లా సహకార సంఘ అధికారులను కోరారు. తాము ఎలాంటి అవినీతి పాల్పడి పోయిన ప్రస్తుత జగిత్యాల జిల్లా డిసివో నోటీస్ ఇవ్వడం పైన హైకోర్టు ద్వారా స్టే తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన తాడూరి సంజయ్ నిహారిక రిసెప్షన్ రెడ్డి సంఘం ఫంక్షన్ హాల్ లో జరగగా అట్టి వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి .వారి వెంట చెవుల మద్ది గంగాధర్ ,చిర్ర దిలీప్ ,తడగొండ విజయ్ ,నేరెళ్ల మహేష్ ,ఆవుల ప్రవీణ్ యాదవ్ ,కాలువ మధు ,రామన్న ,ముబీన్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పురుషుడు శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్



**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం తహసీల్ కార్యాలయంలో బంజారాల ఆరాధ్య దైవమైన శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అంతర్గాం తహసీల్దారు తూము రవీందర్ పటేల్‌తోపాటు రామగుండం ఇన్‌ఛార్జి తహసీల్దారు ఈశ్వర్, అంతర్గాం ఎమ్పీడీవో బైరి వేణుమాధవ్, పాలకుర్తి ఎమ్పీడీవో కలికోట రామమోహనచారిలు పాల్గొన్నారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలు కొనియాడారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావునిగా ఆయనను భావిస్తారన్నారు. సేవాలాల్ మహారాజ్ బోధనల ద్వారా బంజారా జాతి నేటికి పురోగమిస్తున్నదని కేవలం బజారాలకే కాదు ఆయన యావత్తు ఇతర కులాలకు కూడ ఆదర్శ పురుషుడయ్యాడని కీర్తించారు. సంత్ సేవాలాల్ టెంపుల్ కమిటీ సభ్యులు, అసోసీయేషన్ సభ్యులు బదావత్ సారయ్య నాయక్, శంకర్ నాయక్, జరుపుల సమ్మునాయక్, బానోత్ సురేష్ నాయక్, ఇస్లావత్ సారయ్య నాయక్‌లు పాల్గొన్నారు.

## ‘వర్క్ వీసా’పై మోసం

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** షాత్రాజుపల్లికి చెందిన పొన్నాల కనుకయ్య ,మొగిలి రామస్వామిలను ఖతార్ దేశానికి వర్క్ వీసా మీద పంపిస్తానని హుమాయున్ నగర్, హెదరాబాద్ కి చెందిన షేక్ షాజహాన్ బేగం మాయ మాటలు చెప్పి వారిని నమ్మించింది. ఒక్కొక్కరివద్ద వద్ద 1,15,000 రూపాయలు తీసుకుని వారిని వర్క్ వీసాపై పంపించకుండా, వారి డబ్బులు కూడా తిరిగి ఇవ్వకుండా మోసం చేసింది. ఈమె ఇలాగే వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరియు కరీంనగర్ జిల్లాకు చెందిన వారిని మరి కొంతమందిని కూడా ఇలాగే మోసం చేసిందని తెలిసింది. బాధితుల నుండి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంకా ఎవరెనా ఈమె ద్వారా మోసపోయినటువంటి బాధితులు ఉంటే వేములవాడ టౌన్ పోలీస్ వారిని సంప్రదించగలరని వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ బి వీరప్రసాద్ తెలిపారు. నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు.

## అమూల్యమైన ఓటుతో నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ పట్టణంలోని పలు పాఠశాలల్లో, బార్ అసోసియేషన్ లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని బారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు మీ అమూల్యమెన ఓటును మొదటి ప్రాధాన్యతగా వేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని బారీ మెజారిటీతో గెలిపించాలి. గతంలో జీవన్ రెడ్డిని ఆదరించినట్లుగా నేడు నరేందర్ రెడ్డిని ఆశీర్వదించాలి కోరారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో డిఎస్సీ జరిగింది. మళ్ళీ గత పదేళ్లుగా డిఎస్సీ వేయలేదు.మళ్ళీ కాంగ్రెస్ వచ్చాక డిఎస్సీ వేశామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్లు ఇవ్వడం జరిగింది. బి ఆర్ ఎస్ పదేళ్ల లో 55 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు, కానీ కాంగ్రెస్ వచ్చాక పది నెలల్లో 55 వేల ఉద్యోగాలు ఇచ్చాము. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసిఆర్ కి దక్కింది. రేవంత్ రెడ్డి ప్రతి రోజు 18 గంటలు కష్టపడి పనిచేస్తూ రాష్ట్రాన్ని గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. వేములవాడ నియోజకవర్గంలో పడవుపడ్డ ప్రాజెక్టులను నేడు ముందుకు తీసుకెళ్లడం జరుగుతుంది. మూలవాగులో, గుడిచెరువులో మురికి నీరు కలవకుండా సుమారు 9 కోట్ల పైచిలుకు నిధులతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం రానున్న 100 సంవత్సరాల వరకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రాజన్న ఆలయాభివృద్ధి. వేములవాడ పట్టణంలోని మూడో బ్రిడ్జి నిర్మాణం టెండర్లు పూర్తయి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

## టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థి కొమురయ్యకు మద్దతు




**ప్రజాపక్షం/కరీంనగర్‌:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు తథ్యమని బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మంకమ్మతోటలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో బిసి యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ ఆద్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి దొగ్గలి శ్రీధర్ ముఖ్య అతిధిగామాట్లాడారు. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యకు బిసి సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికలు 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్ అన్నారు. ఇది రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతున్నాయని పేర్కొన్నారు. బిసి అభ్యర్థులను చట్టసభల్లో పంపటం ఖాయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి ఉపాధ్యాయ అగ్రకుల పార్టీలలో విసిగిపోయారన్నారు. బహుజనులు అంతా టీచర్ ఎమ్మెల్సీ బిసి అభ్యర్థి మల్క కొమురయ్యను భారీ మెజార్టీతో గెలిపించి చరిత్ర సృష్టించబోతున్నారని తెలిపారు. బిసి టీచర్ ప్రమోషన్లలో రిజర్వేషన్లు సాధనకు క్రిమిలేయర్ ఎత్తివేత, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వ్యతిరేకంగా పోరాడామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాయిల రాజ్ కుమార్ గుమ్మడి శ్రీనివాస్, అంతరిగి రాజు, కుమార్ తదితరులున్నారు.

## మీ ఆగడాలను కొనసాగనివ్వం..



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** బీఆర్ఎస్ సిరిసిల్లా జిల్లా అధ్యక్షులు అక్రమ ఆస్తులు కూడబెట్టారని వారం రోజుల్లోగా రాజన్నసిరిసిల్లా కలెక్టర్‌కు నివేదిక అందచేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాట నర్సయ్య మీడియా సమావేశంలో తోట ఆగయ్యపై మండిపడ్డారు.శుక్రవారం ఆయన కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడారు. సింగారంలో ఎకరం భూమి కబ్జాకు గురైందని అధికారులు స్వాధీనం చేసుకున్నరని అన్నారు. అదేవిధంగా వెంకటాపురంలో ఆయన సతీమణి పేరుతో మూడు ఎకరాలు భూమి తిరిగి తీసుకుంటుందని భయంతో ముందస్తుగానే బీఆర్ఎస్ అధ్యక్షులు బేయిల్ తీసుకున్నారని ఆరోపించారు.బీఆర్ఎస్ సిరిసిల్లా జిల్లా అధ్యక్షుడి అక్రమాలను వెలికితీస్తున్నమని అన్నారు.తహసీల్ అధికారులు విచారణ చేపడుతున్నారని చెప్పారు.ఆయన అక్రమ ఆస్తులపై సీబిఐ స్థాయిలో విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నమన్నారు.బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అన్యాయంగా సామన్యులపై అక్రమంగా కేసులు పెడితే ఇప్పటికి తిరుగుతూనే ఉన్నరని మండిపడ్డారు.భూఆక్రమణలపై,అన్యాయంగా ఆస్తులు సంపాదిస్తే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదని దొమ్మాట నర్సయ్య అన్నారు.ఆయన తప్పిదాలను ఆత్మవిమర్శ చేసుకోవాలని మాట్లాడారు.సమగ్ర విచారణ చేపట్టి ఆగయ్య అరాచకాలను నిలబెట్టితీరుతామని పేర్కొన్నారు.కేటీఆర్ సైతం ఆకృత్యాలు చేశాడోలేదో కాని ఆయన అక్రమాలను తప్పకుండా ఎండగడతామని విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జిల్లా కార్యదర్శి వంగగిరిధర్‌రెడ్డి, పట్టణదృక్షులు చెన్నిబాబు,ఎడ్లరాజ్‌కుమార్,బీపేటరాజ్ కుమార్ తదీతరులు సమావేశంలో ఉన్నారు.

## పేద మహిళ వివాహానికి సాయం

**ప్రజాపక్షం/వీణవంకః** వీణవంక మండలం కోర్కల్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఎండి.రిజ్వానా వివాహం ఈ నెల 23న నిశ్చయించగా గ్రామంలోని కొంత మంది దాతల సహకారంతో వివాహం చేయనున్నారు. ఈ విషయాన్ని కోర్కల్ గ్రామస్తులు రాకేష్ రెడ్డికి తెలియజేయడంతో తన యువసైన్యం 75 కిలోల బియ్యాన్ని అందజేశారు. రిజ్వాన తండ్రి ఇబ్రహీం గత ఐదు సంవత్సరాల క్రితమే చనిపోయాడు. పేదరికంలో కుటుంబ జీవనం సాగిస్తున్న కుటుంబానికి చేయూతనందించారు. కార్యక్రమంలో రాకేష్ రెడ్డి యువసైన్యం వ్యవస్థాపకుడు పోతరవేన సతీష్‌కుమార్, మల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, రాంగోపాల్ రెడ్డి, మర్రి కుమార్, పల్లెర్ల కిరణ్, మద్దుల ప్రశాంత్, విద్యాసాగర్, చిలివేరి రమేష్, ఎండి షాబుద్దీన్, తిరుపతి, రాకేష్, రాజలింగు, మునీర్, అంకుష్, సమ్మయ్య, బొడిగె బీరయ్య, శివ, మహమ్మద్, అజారుద్దీన్, జగన్ తదితరులున్నారు.

## విమలక్కకు సన్మానం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని పట్టణానికి వచ్చిన అరుణోదయ రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్కను శుక్రవారం కలిసి శాలువాతో ఆమెను సన్మానించినట్లు కాంగ్రెస్ పార్టీ రామగుండం పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విమలక్కకు స్వాగతం పలికి సన్మానించినట్లు తెలిపారు. తన ఆటపాటలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలను జాగృతం చేసి స్వేచ్ఛా, స్వాతంత్రాల కోసం ఉద్యమించేలా చేసిన గొప్ప కళకారిణి విమలక్క అని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తన ఆటపాటలతో ప్రజలను మేల్కొలిపిన విమలక్కను యావత్ తెలంగాణ ప్రజలు తమ ఆడబిడ్డగా గుర్తుంచుకుంటారన్నారు. ఏనాడు తన కోసం కాకుండా నిరంతరం ప్రజల అభ్యున్నతి కోసం పనిచేసిన వీర వనితవిమలక్క సేవలు అద్భుతమని కళాకారులు అన్నారు.

## కాంట్రాక్టు కార్మికులను ఇబ్బంది పెట్టొద్దు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** సింగరేణి ఆర్‌జి1 ఏరియా ఆస్పత్రిలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వెంటనే కార్మికులకు వేతనాలు అందేలా చూడాలని కోరుతూ డిప్యూ టి జీఎం ముప్పిడి రవీందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేసినట్లు తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ తెలిపారు. ప్రతి ఆరు మాసాలకు ఒకసారి ఇచ్చే యూనిఫామ్ దుస్తులు ఇవ్వాలన్నారు. ప్రతినెల 8వ తేదీన వేతనాలు ఇవ్వాలని, రెండవ తేదీలోపు పేమేంట్ స్లిప్పులు ఇవ్వాలని, సీఎంపీఎఫ్ బుక్కులు అందజేయాలన్నారు. ఇండ్లు లేని కార్మికులకు సింగరేణి క్వార్టర్లు కేటాయించాలని, పండుగలకు పీహెచ్‌డీ అమలు చేయాలన్నారు. 11ఎ పరిధిలో జెఎంఎస్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు సెక్యూరిటీ సిబ్బందికి కూడ జీవో ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

# భవిష్యత్తుకు బాటలు వేసేది ‘ఉపాధ్యాయుడే’



**ప్రజాపక్షం/కుంటాల :**ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధాయయుడి ప్రాతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర స్ఫూర్తి గా మిగిలిపోతుందని పీ.ఆర్.టీ.యూ,జిల్లా అధ్యక్షుడు నరేంద్ర బాబు అన్నారు.శుక్రవారం మండలకేంద్రంలోని జెడిపిఎస్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు సగ్గం గంగాధర్ పదవి విరమణ పొందిన నేపథ్యంలో వారికీ మున్నూరు కావు సంఘ భవనం లో సన్మాన మహోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు,తోటి ఉపాధ్యాయులు ఘనంగా శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..అంకితభావంతో పనిచేసి విద్యార్థుల.పాఠశాల ప్రగతికి కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు.ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుందని అనుభవం కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలో పనిచేస్తున్నారని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరి ఉత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు,వివిధ పార్టీల నాయకులుతదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/పెంచికల్ పేట్:**జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల చేడ్వాయి గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థులు పొట్టె అను, పొట్టె శ్రీకర్‌లు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) కు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.రమేష్‌బాబు, సీనియర్ ఉపాధ్యాయుడు టి.రాకేష్ శుక్రవారం తెలిపారు. గత సంవత్సరం నవంబర్ 24న నిర్వహించిన పోటీ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వీరు ఈ ప్రతిష్టాత్మక స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారని, ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు ప్రతి ఏడాది రూ. 12,000 చొప్పున స్కాలర్‌షిప్ అందనుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/జన్నారం:**తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నూతన మండల కార్యవర్గాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నిక చేశారు. మండల కమిటీ అధ్యక్షుడిగా మగ్గిడి తిరుపతి, ఉపాధ్యక్షులుగా తుడుం సునీల్, అరే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా దుమల్ల ఎల్లయ్య, దుంపల జీవన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీ అధ్యక్షుడు మగ్గిడి తిరుపతి మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు

## ఎంపి.గోడెం.నగేష్, ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్..

**ప్రజాపక్షం/బైంసా:**పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్లమెంట్ సభ్యులు గోడెం నగేష్,ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు.శుక్రవారం బైంసా పట్టణ ,మండల ముఖ్య కార్యకర్తలతో ఎన్నికల సమీక్ష సమావేశాన్ని చేపట్టిన సందర్భంగా వారు మాట్లాడారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసేలా కార్యకర్తలు ప్రతి ఉపాధ్యాయుని పట్టభద్రుని వద్దకు వెళ్లి అభ్యర్థించాలన్నారు.ప్రతి 25 మంది ఓటర్లకు ఇన్చార్జి నియమించడం జరిగిందని సమయం తక్కువ ఉన్నందున,పనితీరును వేగవంతం చేయాలన్నారు.బిజెపి పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు.పదవు లు రాలేదని నిరాశ చెందకుండా పనిచేస్తే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు,మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పదవుల్లో పనిచేసే వారికి న్యాయం చేస్తామన్నారు.సామాన్య మహిళ కు,మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలివడంతోరేఖ గుప్తాను డిల్లీకి ముఖ్యమంత్రి,చేసిన ఘనత బిజెపి పార్టీది అన్నా రు. ముధోల్ నియోజకవర్గంలో భారీ మెజార్టీ సాధించేలా కృషి చేయాలని,మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం తప్పక వరిస్తుంది అన్నారు.కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,నారాయణరెడ్డి,గోపాల్ సర్డా,పట్టభద్రులు ఎమ్మె ల్సీ నియోజకవర్గ ఇంచార్జ్ హరి నాయక్ ,బిజెపి జిల్లా ప్ర ధాన కార్యదర్శి పైడి పల్లి గంగాధర్,బైంసా మాజీ మున్సిప ల్ చైర్మన్ బి.గంగాధర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రా జేష్ బాబు,బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ,మాజీ ప్రజా ప్రతినిధులు,మాజీ కౌన్సిలర్లు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫాసిస్ట్,కార్పొరేట్,మతోన్మాద విధానాలను వ్యతిరేకిద్దాం..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆల్ ఇండియా సదస్సును ఈ నెల 28వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహిస్తుందని ఈ సదస్సుకు అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.జిల్లా కేంద్రంలో శుక్రవారం రోజున ఢిల్లీ సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్బంగా సిపిఐ ఎంఎల లైన్ పార్టీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె.రా జన్న.మాట్లాడుతూ ఫాసిస్ట్ కార్పొరేట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని,ప్రజాస్వామ్యం,లౌకికవాదం,ఫెడరలిజంకై ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు్. మోడీ పాలన యొక్క ఆర్థిక అభివృద్ధి నమూనా బిలీనియర్లను,అతి సంపన్నుల వికాసం కు మాత్రమే కానీ వ్యవస్థీకృత,అసంఘటిత రంగాల్లో శ్రమింఛ్చ కోటానుకోట్ల కార్మికుల కోసం కాదని వ్యవసాయ కూలీల భూమిలేని పేద రైతులు చిన్న సన్నకారు రైతులకు కాదని ఆశ అంగన్వాడి మధ్యాహ్న భోజన పథకం కార్మికులను కాదని పేద,దిగువ మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు అత్యధిక సంఖ్యలో ఉండే ఎస్సి,ఎస్టి,ఒబిసివర్గాలకు కాదని బుజువైంది . మోడీ దశబ్దం పైగా పాలనలో ఆదాయం ధనికులు పేదల మధ్య సంపద అసమానత విపరీతంగా పెరిగిందని స్పష్టమైంది.సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నందున ద్రవయోల్బణం కేంద్ర బడ్జెట్లో కొన్ని నిర్దిష్టమైన చర్యలు ప్రతిపాదిస్తారని ఒర వరగం ప్రజల్లో అంచనాలు ఉన్నాయి.నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదల నియంత్రణ ఉపాధి కల్పన వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధర సామాన్య ప్రజల కొనుగోలు శక్తి పెంపు రైతు రుణమాఫీ,విద్యకు,జిడిపిలో ఆరు శాతం ఆరోగ్యానికి మూడు శాతం కేటాయింపులపై గట్టి చర్యలు ప్రతిపాదిస్తాయన్న అంచనాలు కూడా ఉన్నాయి.కానీ యథావిధిగా పాలకవర్గాల వర్గ స్వభావానికి అనుగుణంగా ఈ సంవత్సరం బడ్జెట్ విదేశీ స్వదేశీకి కార్పొరేట్ల పెట్టుబడుదారి భూస్వాముల బాగుకే అత్యంత ప్రాధాన్యత నిచ్చిందని,ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఉపసంబంధం కలిగించే ప్రతిపాదన ఫిబ్రవరి 5న తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అనుకూలంగా ఢిల్లీ మధ్యతరగతి వర్గాల సంఖ్య చాలా పెద్దది ఆకర్షించడానికి ఒక ఎత్తుగడ మాత్రమని అన్నారు.పై సమస్యలను చర్చించడానికి ఈనెల 28న న్యూడిల్లీలో,జరుగు ఆలిండియా సదస్సును జయప్రదం చేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఫెరోజ్,గంగాధర్,రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా ధృక్పథం కలిగిన వ్యక్తి ప్రసన్న హరికృష్ణ



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :**రాబోయే పట్టభద్రుల ఎంఎల్సి ఎన్నికల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎంఎల్సి అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ గౌడ్‌కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి గెలిపించాలని సిర్పూర్ నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ కోనేరు కోనప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో యువకులతో కలిసి ఎంఎల్సి అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ గౌడ్ తరపున ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప మాట్లాడుతూ పట్టభద్రుల తరపున మండలిలో ప్రశ్నించే గొంతుక ప్రసన్న హరికృష్ణ అని, మంచి చదువుకున్న విద్యావేత్తగా ఎంతో మంది యువకులకు విద్యాబుద్ధులు నేర్పిన గొప్ప వ్యక్తి హరికృష్ణ అని, విద్యార్థులకు అనేక రకాలుగా సహాయసహకారాలు అందించిన మహానుబావుడు హరికృష్ణ అని అన్నారు. పార్టీలకు అతీతంగా ఎంఎల్సి ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణకు మద్దతు తెలిపి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులైన యువతీ యువకులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సంజీవ్, సుధాకర్, శ్రీనివాస్, మండల నాయకులు చౌదరి తిరుపతి, శ్రీనివాస్, ఖైరాద్, వేంకటచలం, బండన్న, వెంకన్న, యువకులు మేకల ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

# వరిలో కాండం తొలుచు పురుగు నివారణపై అవగాహన



**ప్రజాపక్షం/మందమర్రి :**మందమర్రి మండలం నార్లాపూ ర్ గ్రా మం లో వరిలో కాండము తొలుచు పురుగు నివారణ పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి మాట్లాడుతూ వరిలో కాండము తొలుచు పురుగుల ప్రభావం ఎక్కువగా ఉంటే దిగుబడి తగ్గిపోతుందని, రైతులు ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. పురుగు ప్రబలిన పరిస్థితుల్లో ఫెరోమోన్ ట్రాప్‌లు, లైటు ట్రాప్‌లు వాడితే పురుగుల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే, సమయానికి సరైన పురుగుమందులను వాడడం ద్వారా ఈ సమస్యను తగ్గించవచ్చన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే గురించి మాట్లాడుతూ, రైతులందరూ ఇందులో పాల్గొని తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని, ఇది భవిష్యత్తులో సరైన వ్యవసాయ విధానాలను రూపొందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. సరికొత్త సాంకేతిక పద్ధతులను అలవరచుకోవడం ద్వారా వరిలో వచ్చే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రేపు బైంసాకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాక

**ప్రజాపక్షం/బైంసా :**ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రేపు బైంసాకు కేంద్రమంత్రి,బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి రానున్నారని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలియజేశారు. సాయంత్రం నాలుగు గంటలకు ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ని యోజకవర్గ కార్యకర్తలు,పట్టభద్రుల ఓటర్లతో సమావేశం నిర్వహిస్తామన్నా రు. ఈ కార్యక్రమానికి బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి,ఎంపి గోడం నగేష్ తో పాటు బిజెపి జిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు.ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.

# డబ్బుల కోసం వేధించిన వ్యక్తికి జైలు శిక్ష..

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:**డబ్బుల కోసం వేధించిన వ్యక్తికి జైలు శిక్ష,జరిమానా తీర్పునిచ్చింది.కోర్టు సమన్వయ అధికారి డల్లు సింగ్ వివరాల ప్రకారం నిర్మల్ పట్టణం శాస్త్రి నగర్ కు చెందిన నరసయ్యు లక్ష్మణ్‌చందా మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి నుండి 50 వేలు అప్పు తీసుకొని,39 వేలు తిరిగి చెల్లించాడని,మిగతా 11వేల నగదు కొరకు వేధిస్తూ ఉండేవాడని ఈ క్రమంలో టైలరింగ్ నడుపుతూ జీవతం సాగిస్తున్న నరసయ్య షాప్‌కు వెళ్లి బాధితుని భార్యను డబ్బుల కొరకు గొడవపడి ఆమె తలపై గాయపరచగా,పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందని,మేరకు విచారణ జరిపి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్ రావు సాక్షరను ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారని,న్యాయమూర్తి సతీష్ కు ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని వెల్లడించా రు.

# సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు పరీక్ష

**ప్రజాపక్షం/ సిర్పూర్ టి:**తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం నిర్వహించనున్న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సెట్2025) ఈ నెల 23వ తేదీ (ఆదివారం) జరుగనిందని సిర్పూర్ టి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (డిపిఐపి) ప్రిన్సిపాల్ అంబడిపుడి శారద ఒక్క ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రంలో హాజరుకావాల్సి ఉంటుందని, సెంటర్ కోడ్ 250406 లో పరీక్ష రాయనున్న అభ్యర్థులు ఉదయం 9:00 గంటల లోపు కేంద్రానికి చేరుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షకు వచ్చేటప్పుడు అభ్యర్థులు హాల్ టికెట్, ఎగ్జామ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు సమయాన్ని ఖచ్చితంగా పాటిస్తూ, అవసరమైన పత్రాలతో పరీక్షా కేంద్రానికి ముందుగా హాజరుకావాలని ప్రిన్సిపాల్ శారద తెలిపారు.

# షికండి పామును రక్షించిన అటవీశాఖ అధికారులు



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :**సిర్పూర్ టి మండలంలోని షేక్ అహ్మద్ గూడ గ్రామంలో గురువారం రాత్రి రెండు తలల పాముగా పిలవబడే షికండి పాము కనిపించింది. గ్రామస్థులు ఈ సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు అందించగా, వారు వెంటనే అక్కడికి చేరుకుని పామును సురక్షితంగా రక్షించారు. అనంతరం ఉన్నతాధికారుల సూచన మేరకు దాన్ని సమీప అటవీప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ ఇక్బాల్ హుసేన్ మాట్లాడుతూ ఈ పామును రెడ్ సాండ్ బో అని పిలుస్తారని, ఇది పూర్తిగా విషరహితం అని తెలిపారు. ఇది మట్టి బొరియల్లో నివాసం ఉండి, కీటకాలు, ఎలుకలు, బల్లులు వంటివాటిని ఆహారంగా తీసుకుంటుందని అన్నారు. కొన్ని మూఢనమ్మకాల కారణంగా ఈ పాములు ఇప్పుడు తీవ్ర ప్రమాదంలో ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే పాముల రాకను నిరోధించవచ్చని సూచించారు. ఎవరైనా ఈ పాములను బంధించినట్లు లేదా అక్రమ రవాణా చేసినట్లు తెలిసినా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపిదే విజయం :ఎంపి నాగేష్..



**ప్రజాపక్షం/కుంటాల** :రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపిఅత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని ఎంపి జి. నాగేష్ ధీమా వ్యక్తం చేశారు.శుక్రవారం కంటాల మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా ఉన్న వాళ్లకు పట్టం కడితే ప్రశ్నించే గొంతుక అవుతారని ఆయన పేర్కొన్నారు.నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువత పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.కేంద్రం బడ్జెట్‌లో ప్రభు త్వ, ప్రైవేట్ ఉద్యోగస్తులకు,మధ్య తరగతి వారికి 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు చిన్న ఘనత బిజెపి దేనినని పేర్కొన్నారు.ముఖ్యంగా 317 జిఒకు వ్యతిరేకంగా టీచర్ల సమస్యలపై మొదటి నుంచి పోరాడుతున్న ఏకైక పార్టీ బిజెపిమాత్రమేనని తెలిపారు.బిజెపి బలపర్చిన అభ్యర్థులు కరీంనగర్,నిజామాబాద్,మెదక్,ఆదిలాబాద్,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి,టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో కార్యకర్తలు పార్టీ బలోపేతానికి నిరంతరం సైనికుడిలా కృషి చేయాలని ఆయన అన్నారు.ప్రజల్లో ప్రభుత్వం పై వ్యతిరేకత ఉందని,గత బిఆర్ఎ స్,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉపాధ్యాయ వర్గాలకు తాము అండగా ఉన్నామన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ము ధోల్ ఇంచార్జి హరి నాయక్,శివ చర ణ్,స్థా నిక నాయకులు అప్క గజ్జరాం,పిప్పెర్ వెం గల్ రావు,ఓడ్నాల పవన్ తదితరులు పాల్గొన్నా రు.

# 24న మండల పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/లక్ష్మ ణాచందా:**కొండాపూర్ గ్రామంలోని చంద్రశేఖర్ ఫంక్షన్ హాల్ నందు 24న సోమవారం రోజున లక్ష్మ ణ చందా మండల పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్నారు.కావున ఈ కార్యక్రమంలో మండల పట్టభద్రులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ మండలంలోని పట్టభద్రులందరికి పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టబదులందరూ పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని పూర్తి మద్దతు వారికి ఇవ్వాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో నారాయణ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మేకల రాజేందర్ యాదవ్,మల్లేష్,నరేష్ ఇతర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దూడలపై చిరుత దాడి

## ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

## భయాందోళనకు గురవుతున్న ప్రజలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:**దూడలపై ఓ చిరుత దాడి చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం అబ్బాపూర్(ఎం) గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట్ మండలం అబ్బాపూర్(ఎం) గ్రామ శివారులో బిల్లెడగా అబ్బన్నకు చెందిన పొలం కొట్టంలో కట్టిన రెండు దూడలు గాయాలతో మృతిచెందాయి. దీంతో అనుమానంతో అబ్బన్న ఫారెస్ట్ అధికారులకు ఈ విషయమై సమాచారం అందించారు. దీంతో రేంజ్ ఆఫీసర్ సంజయ్ గౌడ్ వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత పులి ఆనవాళ్లు కన్పించాయని వారు నిర్ధారించారు. దూడలకు పశువైద్యాధికారితో శవ పంచానామా చేయించారు. చిరుతను పట్టుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా రేంజ్ ఆఫీసర్ సంజయ్ గౌడ్ మాట్లాడారు. రాత్రిపూట అటవీ ప్రాంతం వైపు ఒంటరిగా ఎవ్వరూ వెళ్లొదని ఆయన ప్రజలకు సూచించారు. చిరుతను పట్టుకోవడానికి బోను ఏర్పాటు చేస్తామన్నారు.

# ఎంఎంపిటిఎఫ్ అమలుకు సహాయ సహకారం;కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి** :వలసదారులు దుర్భల కుటుంబాల స్థితి స్థాపకతను మెరుగుపర్చాలనే లక్ష్యంతో యుఎన్ఓ ద్వారా ప్రయోగాత్మకంగా జిల్లాలో అమలు చేయనున్న మైగ్రేషన్ మల్టీ పార్ట్‌నర్ ఫండ్ (ఎంఎంపీటీఎఫ్) కార్యక్రమాన్ని పక్కాగా అమలు పరుస్తూ, నిర్దేశిత లక్ష్యాలు సిద్ధించేలా జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఈ కార్యక్రమం అమలు విషయమై కేంద్ర ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స ద్వారా జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో శుక్రవారం సమీక్ష సమావేశం జరిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాను ఎంపిక చేయటానికి గల కారణాలు ఎంఎంపీటీఎఫ్‌ను అమలు చేయాల్సిన విధానం, యుఎన్ఓ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందించే తోడ్పాటు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో వసలదారులు, దుర్భల కుటుంబాల స్థితిగతులపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. వారి స్థితిగతులలో మార్పును ఆశిస్తూ అమలు చేయ సంకల్పించిన పైలెట్స్ ప్రాజెక్టును జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా జిల్లా యంత్రాంగం ద్వారా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలందేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి పారదర్శకంగా ఈ కార్యక్రమం అమలయ్యేలా చూస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ సాయగౌడ్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యుఓ రసూల్ బి, పశు సంవర్ధకశాఖ అధికారి జగన్నాథచారి, డీపీఓ శ్రీనివాస్, రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్, సిరికొండ, ధర్పల్లి ఏఓలు నర్సయ్య, వెంకటేష్, యుఎన్ఓ ప్రతినిధులు జగన్మోహన్, డాక్టర్ లిస్సీ జోసెఫ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనిల్, వాసిల్ పాల్గొన్నారు.

# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి:ఎస్ఐ



**ప్రజాపక్షం /బాన్సువాడ** :రోడ్లపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల నివారణకు ట్రాపిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ అశోక్ అన్నారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీచేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించినట్లయితే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటుబెల్టు, వాహన నెంబరు ప్లేట్లు తప్పనిసరి వాహనానికి ఉండేటట్టు చూసుకొని వాహనానికి సంబంధించిన ధృవపత్రాలు తనిఖీ చేసే సమయంలో పోలీసులకు సహకరించాలన్నారు. మద్యం తాగి వాహనాన్ని నడిపినట్లయితే తాము ప్రమాదాలకు గురికావడమే కాకుండా ఇతరులను కూడా ప్రమాదాలకు గురిచేసే ఆస్కారం ఉందని మద్యంతాగి వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ , కానిస్టేబుల్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ప్రజల దశాబ్దాల కల నిజమైన వేళ!



**ప్రజాపక్షం/బెల్లంపల్లి** :బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నాల గ్రామపంచాయతీలో గల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర దేవాలయం వందల సంవత్సరాల చరిత్రను సంతరించుకుని ఉన్నది. అయితే, ఈ దేవాలయానికి వెళ్లే మార్గంలో తారు రోడ్డు లేకపోవడం మహాశివరాత్రి పర్వదినం సమయంలో జాతరకు వచ్చే భక్తులతో పాటు సాధారణ ప్రయాణికులకు కూడా అసౌకర్యాన్ని కలిగించేది. గత 40 ఏళ్లుగా పలువురు పాలకులు సాధించలేని ఈ సమస్యను బెల్లంపల్లి ఎంఎల్ఏ గడ్డం వినోద్ తన అకుంఠిత దీక్ష, అహర్నిశ కృషితో పరిష్కరించారు. అటవీ శాఖ అనుమతులు పొందించి, నిధులు మంజూరు చేయించి, తారు రోడ్డు నిర్మాణం చేపట్టించి నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేశారు. ఈ మహత్తర పనిని సాధించడంలో అయన పట్టుదల, శ్రమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా, శివపార్వతుల ఆశీర్వాదంతో త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో గడ్డం వినోద్‌కు మంత్రి పదవి రావాలని, ఆయన నేతృత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# గురుకుల పాఠశాలలో 'బాల్య వివాహ ముక్త్ భారత్' కార్యక్రమం



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఫోక్సో చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ పిల్లలు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని వారి హక్కులకు ఎటువంటి భంగం కలిగిన ఈ 1098 నంబర్ కు కాల్ చేసి వాటి సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. అదే విధంగా ప్రధాన మంత్రి ఇచ్చిన పిలుపు మేరకు భారత దేశాన్ని బాల్య వివాహ ముక్త భారత్ గా మార్చాలని అందరూ చదువు పై శ్రద్ధ చూపి తల్లిదండ్రులకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిపియు కౌన్సిలర్ మాట్లాడుతూ చిన్నపిల్లల పెళ్ళిళ్ల వలన జరిగే అనర్థాల గురించి పిల్లలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పిల్లల భవిష్యత్, ప్రణాళిక గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో డిసిపిఎం ఔట్ రిచ్ వర్కర్ రవికాంత్, డిసిపియు ఔట్ రిచ్ వర్కర్ అశ్విని, కళాశాల ప్రిన్సిపల్ జి.సంగీత, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యభిచార గృహంపై దాడి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్** :నిజామాబాద్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధు శర్మ ఆదేశాల మేరకు లక్ష్మి ప్రియనగర్‌లో వ్యభిచార గృహంపై శుక్రవారం టాస్క్‌ఫోర్సు ఇన్స్‌పెక్టర్ అంజయ్య, స్పెషల్‌పార్టీ పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో ఒక నిర్వాహకురాలిని, ఇద్దరు బాధిత మహిళలను, ఇద్దరు విటులు, వారి వద్దనుంచి నగదు రూ. 670, 1 నిరోద్ ప్యాకెట్లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం నిజామాబాద్ రూరల్ పిఎస్, ఎస్‌హెచ్‌వోకి అప్పగించారు.

# మానవత్వం చాటుకున్న అధ్యాపకులు



**ప్రజాపక్షం/నందిపేట్ :**నందిపేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుకుంటున్న అవంతికకు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతు మృత్యువుతో పోరాడుతుంది. తనకు తోచిన విధంగా చికిత్స చేయిస్తు హోటల్‌లో పనిచేస్తు అవంతిక తల్లి బతికిచేందుకు ప్రయత్నాలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న నందిపేట్ అధ్యాపకులు తమకు తోచిన విధంగా అందరు అవంతికకు సహాయం అందజేశారు.

# రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/కోటగిరి:**నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తొండ గ్రామంలో శుక్రవారం శివాజీ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతిఏటా శివాజీ జయంతిని పురస్కరించుకొని రక్తధాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రక్తదానం వల్ల ఒకరి ప్రాణం నిలబెట్టవచ్చని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు హన్మంతు, జగన్, శివ, శ్యామ్, శంకర్, కార్తీక్, శివరామ్, సాయి కుమార్, రెడ్ క్రాస్ సోసైటీ సభ్యులు హన్మంతరావు, వెంకటేశం గుప్తా, బర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# హైటెక్ వ్యభిచారం గుట్టురట్టు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:జిల్లా కేంద్రంలోని లక్ష్మీ ప్రియనగర్‌లో వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్సై అంజయ్య తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి పోలీస్ కమీషనర్ సింధూశర్మ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందం దాడులు నిర్వహించారు. పోలీసుల దాడితో లక్ష్మీ ప్రియనగర్‌లో గత కొంతకాలంగా సాగుతున్న వ్యభిచార గుర్తు రట్టయింది. ఈ దాడిలో వ్యవభిచార గృహం నిర్వహిస్తున్న మహిళతో పాటు మరో ఇద్దరు మహిళలకు ఇద్దరు విటులను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య వెల్లడించారు. వ్యభిచార గృహ నిర్వాహకులు వద్ద 670 నగదు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం రూరల్ పోలీసులకు అప్పగించినట్లు స్పష్టం చేశారు.

# రేపు టిజిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు సిద్ధం

ప్రజాపక్షం/లక్షెట్టిపేట:తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం రేపు నిర్వహించనున్న టిజిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు లక్షెట్టిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె. రమా కల్యాణి తెలిపారు. ఈ పరీక్షలో 5వ తరగతి ప్రవేశం కోసం 340 మంది, 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మరో 340 మంది, మొత్తం 680 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు నీలి లేదా నలుపు రంగు బాల్ పాయింట్ పెన్నులు, పరీక్ష ప్యాడ్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్ష ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు కొనసాగుతుందని, విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

# మహాశివరాత్రి జాతర గోడ ప్రతుల ఆవిష్కరణ



ప్రజాపక్షం/కౌటాల :తాటిపల్లి శివారులోని వార్ధ నది కుర్తా దేవాలయంలో జరుగనున్న 41వ మహాశివరాత్రి జాతర మహోత్సవం సందర్భంగా గోడ ప్రతులు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన సాధు సంత్ శ్రీశ్రీశ్రీ బాల్ బ్రహ్మచారి పీతాంబర్ మహారాజ్ గారి చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షులు బొమ్మకంటి మహేష్, చైర్మన్ దత్తులు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నది ఒడ్డునుంచి ఆలయం వరకు తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు రోహిణి సంతోష్, ప్రధాన కార్యదర్శి గుడి బాపు, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్పొరేట్ రాజకీయాలను ఓడిద్దాం..

ప్రజాపక్షం/ఖానాపూర్ :ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బుతో గెలవాలన్న ఆలోచనతో వస్తున్న రాజకీయ దాహం కలిగిన వారిని రియల్ ఎస్టేట్ వ్యాపారులను ఓడించి ప్రభుత్వ విద్యారంగా,ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే అశోక్ కుమార్,బ్యాలెట్ పేపర్లో సీరియల్ నెంబర్ నాలుగు కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ అన్నారు.శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవిత్రమైన ఎమ్మెల్సీ వృత్తికి వ్యాపారవేత్తలు కార్పొరేట్ శక్తులు పోటీచేసి గెలవడం ద్వారా ప్రభుత్వ విద్యారంగ విద్యాసానికి పాల్పడతారని అలాగే ఉపాధ్యాయులు హక్కుల గురించి వారికి ఏమాత్రం శ్రద్ధ ఉండదని,రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాళ్ళ వ్యాపార ప్రయోజనాల కోసం ఈ హోదాలను కోరుకుంటున్నారే తప్ప,ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని,అలాంటి నాయకులను ఎన్నుకోవడం ద్వారా మన సమస్యలు పరిష్కారం చేసుకోవడం భావ్యం కాదని,అందు కోసం టిఎస్ యుటిఎఫ్ బలపరుస్తున్న అశోక్ కుమార్ని మండలికి పంపడం ద్వారా మన సమస్యల పట్ల ఇప్పటి వరకు పోరాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి కి తోడుగా అశోక్ కుమార్ గొంతుకు కలపాల్సిన అవసరం ఉందని,అందుకోసం ఉపాధ్యాయులందరూ భావోద్వేగాలకు గురికాకుండా నీతి నిజాయితీతో పనిచేసే అశోక్ కుమార్ కే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని,పిలుపునిచ్చారు.

రాజకీయాలను ఓడించి రియాల్టర్లను ఓడించి ఉపాధ్యాయులు మేధావి వర్గానికి చెందిన వారిని గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని సందర్భంలో గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్,టీఎస్ యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి జిల్లా కన్వీనర్ చల్ల గోవర్ధన్ రావు,టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మురళిధర్,తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి: అన్వేష్ రెడ్డి

ప్రజాపక్షం/సారంగాపూర్:ఉమ్మడి మెదక్,ఆదిలాబాద్,కరీంనగర్,నిజామాబాద్,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేంధర్ రెడ్డిని గెలిపించాలని తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి అన్నారు.సారంగాపూర్ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు.గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ఇబ్బందులు పడ్డారని,రాష్ట్రంలో మార్పు రావాలని కోరుకోవడంలో ప్రజా ప్రభత్వం ఏర్పడిందని తెలిపారు.రేవంత్ ప్రభుత్వం ఉద్యోగులు,ఉపాధ్యాయుల ఫ్రెండ్లి ప్రభుత్వమని పేర్కొన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రూప్ వన్ పరీక్ష నిర్వహించడంతో పాటు 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందన్నారు.టీచర్లకు ప్రమోషన్లు కల్పించడంతోపాటు మెగా డీఎస్సీ నిర్వహించి పదివేల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ దేనని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ప్రతి నెల 20 వరకు జీతాలు వచ్చేదని,తమ ప్రభుత్వం వచ్చాక మొదటి వారంలోనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు.ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు,నిర్మల్,సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్ సోమ భీంరెడ్డి,అబ్దుల్ హాది,మండల పార్టీ అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య,మాజీ జెడ్ పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి,రాజమొహమ్మద్ అయిర నారాయణ రెడ్డి,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్,చించోలి శ్రీనివాస్ రెడ్డి,నరేష్,దశరథ్,రాజేశ్వర్,బోజగౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీయంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాజశ్రీ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గర్భస్త పూర్వ గర్భస్త పిండా లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం డీయంఅండ్‌హెచ్ఓ డాక్టర్ బి.రాజశ్రీ అధ్యక్షతన డీయంహెచ్ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయటం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఏ స్కానింగ్ కేంద్రంలోనైనా గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేసిన తర్వాత పుట్టబోయే శిశువు ఆడ లేదా మగా అని తెలియజేస్తే పిసిపిఎన్డీటీ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోబడును. మెడికల్ షాపుల్లో అబార్షన్ కోసం వాడే ఔషధాలను క్వాలిఫైడ్ డాక్టర్ రిఫరల్ స్లిప్పు లేనిదే అమ్మరాదన్నారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలన్ని రికార్డులను, రిపోర్టులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని లేనిచో వారికి రిజిస్ట్రేషన్ కానీ, రినెవల్స్ కానీ చేయటం జరగదన్నారు. అదేవిధంగా జిల్లాలో విస్తృతంగా బేటీ బచావో బేటీ పడావోపై పాఠశాలల్లో, కళాశాలల్లో గ్రామ, మండల స్థాయి సమాఖ్య సమావేశాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగే అమ్మ ఒడి కార్యక్రమాల్లో నెలవారి సమావేశాల్లో ఆశలు గృహ సందర్శనలో ఐకెపి, మెప్మా, డీఆర్‌డీఏ నెలవారి సమావేశాలలో వివిధ శాఖల సమన్వయంతో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నూతనంగా స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ కోసం ఒక దరఖాస్తు స్కానింగ్ సెంటర్ రెన్యూవల్ కోసం రెండు దరఖాస్తులు రావటం జరిగిందన్నారు. సమావేశంలో రేడియాలజిస్ట్ ద్వితీ, ప్రసన్న,మెప్మా నుండి మాధురి డెమో నాగలక్ష్మి , వేణుగోపాల్ దేవేందర్‌పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ప్రజాపక్షం/కాగజ్‌నగర్:కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాతృభాష పరిరక్షణ, ప్రాముఖ్యతపై అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ మాతృభాష భావ ప్రకటనకు శక్తివంతమైన సాధనం అని, నూతన విషయాలను నేర్చుకోవడంలో మాతృభాషకన్నా సమర్థవంతమైన మాధ్యమం మరొకటి లేదని స్పష్టం చేశారు. వైస్ ప్రిన్సిపల్ డా. డి. లక్ష్మి నరసింహం మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలలో విద్యాబోధన మాతృభాషలోనే జరుగుతుందని, అందువల్ల మాతృభాషను విస్మరించకూడదని పేర్కొన్నారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డి. జనార్ధన్ మాట్లాడుతూ మాతృభాషలో విద్యను అభ్యసించటం వల్ల సులభంగా అర్థం చేసుకోవచ్చు అని వివరించారు. అనంతరం కళాశాల విద్యార్థులు మాతృభాష ప్రాముఖ్యతను తెలుపుతూ పాటలు, గేయాలు ఆలపించి, తమ భావాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజేశ్వర్, శారద, సంతోష్, మహాలక్ష్మయ్య మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:వ్యవసాయం అంటే దండుగ కాదు అని ఒక గొప్ప సదుద్దేశ్యంతో గల కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు ఒక్క సంతకంతో రుణ మాఫీ చేసింది కాంగ్రెస్‌ప్రభుత్వమే అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. అన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆకునూరి బాలరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, గొనె ఎల్లప్ప, ఆడెపు చంద్రకళ, కత్తెర దేవదాస్, శ్రీకాంత్ గౌడ్, గడ్డం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిరాల గ్రామంలో చిరుత పులి సంచార కలకలం

ప్రజాపక్షం/బైంసా:బైంసా మండలం సిరాల గ్రామంలో చిరుత పులి పంచారం కలకలం రేపింది.గ్రామానికి చెందిన మహేష్ నిన్న సాయంత్రం మొక్కజొన్న పంటకు నీళ్లు పారిస్తుండగా చిరుత పులి కంటపడడంతో వెంటనే మహేష్ అప్రపమత్తమై కేకలు వేస్తూ పారిపోయాడుతానూర్ మండలం బేంబర్ గ్రామనికి చెందిన సాయిలు తన చేనులో ఆవు లేగ దూడను కట్టేసి ఇంటికి వెళ్ళాడు,తిరిగి వచ్చేసరికి కట్టేసిన లేగ దూడపై చిరుత పులి దాడి చేసి హతమార్చడంతో అటవిశాఖ అధికారులు చిరుత పులి పాద ముద్రలను సేకరించి చిరుత పులి జాడ కోసం ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు.రైతులు ఒక్కరే వ్యవసాయ పనులకు వెళ్లకుండా గుంపులు గుంపులుగా కేకులు వేస్తూ చేల్లోకి వెళ్లాలని రైతులకు అధికారులు సూచించారు.అటవీశాఖ అధికారులు ఏది ఏమైనా ఈ చిరుత పులి నుండి మమ్మల్ని కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మాజీ మంత్రి



ప్రజాపక్షం/సోన్ :సోన్ మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామంలో నిర్వహిస్తున్న యంత్ర,శిఖర ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు,నాయకులు మాజీమంత్రిని ఘనంగా సన్మానించారు.అల్లోల మురళీధర్ రెడ్డి,ఏంబరి గంగాధర్,రాజేశ్వర్,పిఎసిఎస్ చైర్మన్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు

ప్రజాపక్షం/బైంసా:కుబీర్ మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ మాట్లాడుతూ అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలిపించడానికి కుబీర్ మండలంలో 695 ఓట్లు ఉన్నాయి దాంట్లో భాగంగానే రేపు అనగా ఈ నెల 24వ తేదిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రోగ్రాం నిర్మల్ లో నిర్వహించడం కొరకు ఆలోచనలో ఉన్నారు.ఒకవేళ 24న ప్రోగ్రాం జరిగితే నియోజకవర్గం నుండి కాంగ్రెస్ కార్యర్తలు ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి గ్రామం నుండి గ్రాడ్యుయేట్ అందరిని తీసుకొచ్చి వచ్చి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి ని గెలిపించి పట్టబద్రులు అయినటువంటి వారందరికీ మనస్ఫూర్తిగా సీఎం రేవంత్ రెడ్డి గత కాలంలో 50వేల పైగా ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది.ఈ సారి కూడా డిఎస్‌సి అనుకోండి తదితర ఉద్యోగాలను గ్రాడ్యుయేట్లను ఎన్నికలలో ఏదైతే హామీ ఇస్తున్నామో నరేందర్ రెడ్డి కచ్చితంగా గెలిపించండీ గ్రాడ్యుయేట్ల సమస్య వారికి తెలుసు వారు ఏదైతే మూడు లక్షల బీమా హామీ ఇచ్చారొ ప్రైవేటు విద్యాసంస్థలో పనిచేస్తున్నా గ్రాడ్యుయేటకు 3 లక్షల బీమా వర్తింపచేస్తారు.కావున దానికి కూడా ఉపయోగించుకొని నరేందర్ రెడ్డి ని గెలిపించాలని కోరుతూ అని మీడియా సమావేశంలో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చేంద్రే,శ్రీనివాస్,శరత్,బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాపక్షం/వాంకిడి :రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల విస్తీర్ణ ఆరోగ్య అధికారి రవిదాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బెండరా ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు, ఐసిడిఎస్ ప్రాజెక్టులో అంగన్వాడీ కార్యకర్తలకు క్షయ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారి రవిదాస్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు రెండు వారాలకుపైగా దగ్గు, ఛాతిలో నొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, దగ్గినప్పుడు కఫంతో రక్తం రావడం వంటి లక్షణాల ద్వారా గుర్తించవచ్చని చెప్పారు. అలాంటి లక్షణాలు ఉన్నవారిని తక్షణమే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) డాక్టర్ వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షల్లో క్షయ వ్యాధి (టుబెర్కులోసిస్) పాజిటివ్ అని తేలినట్లయితే, ప్రభుత్వం ఆరు నెలలపాటు ఉచిత మందులు అందజేస్తుందని, అలాగే నిక్షయ్ పోషణ యోజన కింద ప్రతి నెలా 1,000 ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, ఎమ్ఎల్‌హెచ్‌పీ సుచరిత, హెల్త్ ఎడ్యుకేటర్ (టిహెచ్ఎ), ఎఎన్ఎం వసంత, పాఠశాల ఉపాధ్యాయులు, మండల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు

## మున్సిపల్ అధికారులపై విమర్శలు

**ప్రజాపక్షం /చెన్నూరు :**చెన్నూరు మున్సిపాలిటీలో అధికారులను ప్రసన్నం చేసుకుంటే ఏ పని అయినా సాధ్యమవుతుందనే విషయం మరోసారి రుజువైంది. 56 ఎకరాల వ్యవసాయ భూమిని హస్తగతం చేసుకునేందుకు పట్టణానికి చెందిన ఎంఎల్ఏ అనుచరుడు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా, మున్సిపల్ అధికారులు రెండేళ్ల క్రితం తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారుల తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు.

**తప్పుడు ధ్రువీకరణ పత్రం కథ వెనుక నిజాలు**

వివరాల్లోకి వెళ్తే, నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన మహమ్మద్ మూసా అనే వృద్ధుడు 24 ఏళ్ల క్రితం చెన్నూరు పట్టణంలోని బట్టిగూడెం కాలనీలో మృతి చెందినట్లు


REVENUE DEPARTMENT

కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రము

Certified By

మున్సిపల్ కమీషనర్ గంగాధర్ 2 ఏళ్ల క్రితం ధృవీకరణ పత్రం మంజూరు చేశారు. అయితే, అది తప్పుడు ధ్రువీకరణగా వెలుగు చూసింది. విచారణలో మహమ్మద్ మూసా అనే వ్యక్తి మృతి చెందిన ఇల్లు నిజానికి చెన్నూరు పట్టణానికి చెందిన నక్క మల్లయ్యది అని స్పష్టమైంది. గత 35 ఏళ్లుగా తన ఇంట్లో ఎవరికీ కిరాయికి కూడా ఇవ్వలేదని మల్లయ్య తెలిపారు. ఈ పరిస్థితిలో మున్సిపల్ అధికారులు ఎలా మరొకరి పేరుతో మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసారని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**అధికారుల వివరణ – ప్రజల ఆగ్రహం**

ఇదే విషయంపై మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణ వివరణ ఇస్తూ, మంచిర్యాల ఆర్‌డిఒ కార్యాలయం నుంచి వచ్చిన ప్రొసీడింగ్ ఆధారంగా తనకంటే ముందు విధులు నిర్వర్తించిన గంగాధర్ ఈ ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేశారని తెలిపారు. అయితే, తప్పిదం ఎక్కడ జరిగిందో తెలియదని పేర్కొన్నారు. కానీ ఇది నవాబుల కాలం నాటి వ్యక్తికి చెందిన భూమి అని, నేడు ఆ భూమిని గ్రామస్తులు సాగు చేసుకుంటున్న 56 ఎకరాలను ఆక్రమించేందుకు ఎమ్మెల్యే అనుచరుడు ప్రయత్నిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఈ పత్రాన్ని రద్దు చేసి, భూములను అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామీణ వృద్ధులకు ఉచిత మందుల పంపిణీ

**ప్రజాపక్షం /జైపూర్ :**జైపూర్ మండలం దుబ్బపల్లి గ్రామంలో శుక్రవారం ఇన్ఫ్రా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్, ఎల్ పేజ్ ఇండియా సేవా సంస్థల ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత మందుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సోషల్ ప్రొడక్షన్ ఆఫీసర్ శివకృష్ణ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా, అలాగే గత 8 ఏళ్లుగా తెలంగాణలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. షుగర్, బిపి వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులకు ఉచిత హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి 15 రోజులకు ఒకసారి మందులు అందజేస్తున్నామని వివరించారు. ఇంతకు ముందు వికలాంగులకు వాకర్స్, వీల్ చైర్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. వృద్ధుల ఆరోగ్యం, ఆనందం సంస్థ లక్ష్యమని, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మానవ అభివృద్ధిపై మహిళలకు శిక్షణ



**ప్రజాపక్షం / తిర్యాని :**తిర్యాని మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో జంగుబాయి మండల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సమాఖ్య మహిళలు, సాక్ కమిటీ సభ్యులు, విఒఎల కోసం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యశ్వంత్, డిపిఎం అన్నాజీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, టీకాలు తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంలు ప్రకాశ్, శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో కాగితపు రహిత సేవలు..

### జిఎం శ్రీనివాస్



**ప్రజాపక్షం /శ్రీరాంపూర్ :**ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్మెంట్ టెక్నాలజీ ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి సింగరేణిలో కాగితపు రహిత సేవలు ప్రారంభం కానున్నాయని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సిసిసి గెస్ట్ హౌస్ కాన్ఫరెన్స్ హాల్ లో డిజిఎం (ఐటి) బి. హరిప్రసాద్ బృందం ఆధ్వర్యంలో ఏరియా అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిఎం ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ టెక్నాలజీతో పనులు వేగవంతంగా, ఖచ్చితంగా పూర్తి చేయవచ్చని, పర్యావరణ పరిరక్షణ లోనూ ఇది ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం (సివిల్) శ్రీనివాస రావు, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జిఎం సుశాంత సహా, ఎస్ఒటు జిఎం ఎన్. సత్యనారాయణ, ఫైనాన్స్ ఎజిఎం మురళీధర్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారంపై అవగాహన :అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**జిల్లాలో పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది అని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం సాలెగూడ అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, పౌష్టికాహారం అందుబాటు, రిజిస్టర్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలపై నిరంతరం పర్యవేక్షణ జరగాలని, లోపాలు ఉన్న పిల్లలకు సకాలంలో పోషకాహారం, అవసరమైన మందులు అందించాలని సూచించారు. గర్భిణీలు సమీప ఆరోగ్య కేంద్రాల్లో నమోదై, వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలి అని తెలిపారు. అనంతరం బూరుగూడ జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం సమయానికి అందాలని, గైర్హాజరు విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, సీడీపీవో, మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మను, అమ్మ భాషను ప్రేమిద్దాం గోపాల్ రావ్‌పాటిల్..

**ప్రజాపక్షం/బైంసా :**అమ్మను అమ్మ భాషను ప్రేమిద్దాం గోపాల్ రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య మాట్లాడుతూ మాతృభాషలో ఉన్న గొప్పతనాన్ని వివిధ ఆచార వ్యవహారాలను,సంస్కృతిని కాపాడుకుంటూనే వాటి నీ రాబోయే తరాలకు అందించవలసినటువంటి బాధ్యత భాష పై ఉంటుందని,భాష లేకుంటే భావం లేదని ఆ భావాల వల్లనే ఒకరి అభిప్రాయాలను అర్థం చేసుకుని వారి ఆలోచనలు తెలుసుకుంటున్నాము గౌరవించుకుంటున్నామని కావున ఇది భాష వాళ్ళనే సాధ్యం,మాతృ భాషలో ఉన్నటువంటి గొప్పదనం ఆ మాధుర్యం ఎనలేని భాష సంస్కృతిని ఇనుమడింపజేస్తుంది.మాతృభాషలో ఉన్న విలువలను తెలుసుకోవాలి.ప్రపంచంలో ఉన్న మాతృభాష యొక్క గొప్పదనాన్ని ఆ మాతృభాషలో ఉన్న విలువలను సాంప్రదాయాన్ని ఆచార వ్యవహారాలను అంతరించిపోకుండా కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని గుర్తించి ఇటువంటి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఫిబ్రవరి 21న ప్రకటించినదని యునెస్కో ప్రకటించినదని ప్రతి ఏటా నిర్వహించుకోవడం జరుగుతున్నది కావున ప్రతి ఒక్కరు మాతృభాషను ప్రేమించాలి.

అమ్మ ను అమ్మ భాషను ప్రేమిద్దాం గౌరవించాలి వాటిలో ఉన్న విలువల్ని ఇతర సాహిత్యంలోకి తీసుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల పైన కవుల పైన రచయితల పైన ఉంటుందని రన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘునాథ్ భాషా అధ్యాపకులు యు.రవికుమార్,ఆరె.రాజు జాస్రలు ఇతర అధ్యాపకులూ గుంత సుధాకర్ డా.ఓం ప్రకాష్,డా.సంతోష్ కుమార్,డా.నహీదా,డా.కల్పన సురేందర్ దివ్య రాజయ్య శ్రావణ్య,కిషన్ కార్యాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందించారు.

## ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని పట్టభద్రులకు వివరించాలి...

### కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు



**ప్రజాపక్షం / బాన్సువాడ :**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే చేపట్టిన అభివృద్ధిని, ఉద్యోగాల కల్పనకు పట్టభద్రులకు వివరించి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ఓటు వేసేలా ప్రచారం నిర్వహించాలని కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. శుక్రవారం రుద్రూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యకర్తలకు నాయకులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలను కల్పించడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో బిఆర్ఎస్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో దూరంగా ఉండి బిజెపికి లబ్ది చేకూరేందుకే లోపాయికారి ఒప్పందం చేసుకున్నారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన నరేందర్‌రెడ్డి గెలుపు కోసం ఓటు వేసే విధంగా కృషి చేయాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు తోట అరుణ్, నాయకులు నారోజీ గంగారాం, సంజీవులు, ప్రవీణ్, ప్రతి లక్ష్మ ణ్, నాగేందర్, సంజీవన్, రానంపల్లి శంకర్, గోపాల్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

### తిర్యాని ఎంఇఒ అంజయ్య




**ప్రజాపక్షం/తిర్యాని:**విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని తిర్యాని మండల విద్యాధికారి కె. అంజయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్, ఎంపిహెచ్‌డబ్ల్యూ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కష్టాన్ని అధిగమించి, ఆసక్తితో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థి తమకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు ఇంటర్ చదివిన తర్వాతే ఆగిపోకుండా, ఉన్నత విద్యను అభ్యసించి మండలానికి గర్వకారణంగా మారాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పలు సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా విద్యాలయం ప్రత్యేక అధికారి స్వప్న, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఘనంగా సామూహిక అనఘాష్టమి వ్రతాలు



**ప్రజాపక్షం/ మంచిర్యాల టౌన్:**మాఘ మాసాన్ని పురస్కరించుకుని మంచిర్యాల గోదావరి తీరంలోని గౌతమేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో 150 మంది భక్తులతో సామూహిక అనఘాష్టమి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. గత ఏడాది నుంచి గౌతమేశ్వర ఆలయంలో ఈ పవిత్ర వ్రతాన్ని నిరంతరంగా నిర్వహిస్తుండగా, ఈసారి కరీంనగర్‌కు చెందిన వేణుగోపాల శర్మ ఆధ్వర్యంలో భక్తులకు శ్రీ దత్తుని కథ వృత్తాంతం వినిపించడంతో పాటు అనఘాష్టమి వ్రత విశిష్టత, వ్రతం చేయడం వల్ల కలిగే ఆధ్యాత్మిక, జీవిత పరమైన ప్రయోజనాలను వివరించారు. స్వామివారి అనుగ్రహం కోరుతూ అధిక సంఖ్యలో భక్తులు ఈ వ్రతాన్ని ఆచరించేందుకు మంచిర్యాల మాత్రమే కాకుండా, పరిసర ప్రాంతాల నుంచి కూడా తరలివచ్చారు. ఈ పవిత్ర వ్రతం విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ వ్యవస్థాపకురాలు గోపిగాని శ్రీదేవి, నిర్వహణ కమిటీ సభ్యులు పడకంటి శ్రీనివాస్, కేశెట్టి వంశీకృష్ణ, నకిరే కొమ్ముల రాజేంద్రప్రసాద్, ఎపి రాజు, కుకుడపు గాయత్రి రమేష్ తదితరులు ఎంతో శ్రమించారు. వ్రతం పూర్తయిన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేయగా, ఆలయ ప్రాంగణం భక్తి సంద్రంగా మారింది.